# రైతువ్యతిరేక కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి



రైతు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

- సీఎం కేసీఆర్ కృషితోనే రెండింతలైన సాగు విస్తీర్ణం
- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండరూరల్, జూలై 19 : ఉమ్మడి రాష్ట్రంలో సాగుకు సరైన విద్యుత్ ఇవ్వకుండా రైతులను చీకట్ల పాలు చేయడంతో పాటు ఇప్పుడు మళ్లీ ఆ రోజులను గుర్తు చేస్తున్న రైతువ్యతిరేక కాంగ్రెస్ పార్టీని తరిమి కొట్టాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పడ్మట్‌పల్లి గ్రామ రైతువేదికలో నిర్వహించిన రైతు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతులకు 3 గంటల కరెంట్ చాలంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం రైతులను అవమానించడమే అన్నారు. సమైక్య రాష్ట్రంలో వ్యవసాయం సాగక అప్పుల పాలైన రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ 24 గంటల నాణ్యమైన విద్యుత్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సమైక్య రాష్ట్రంలో పడ్డ బాధలను స్వరాష్ట్రంలో మర్చిపోయి ఆర్థికంగా ఎదుగుతున్న రైతుల బతుకుల్లో మళ్లీ చీకట్లు నింపేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు శిష్యుడైన రేవంత్‌రెడ్డి ఆయన బాటలోనే పయనిస్తూ రైతులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ వద్దని, రైతులకు కేవలం 3 గంటల కరెంట్ చాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రైతాంగ ప్రయోజనాలకు గొడ్డలి పెట్టని అన్నారు. రైతులను అవమానించేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుబంధు పథకం కింద రాష్ట్రంలోని 65 లక్షల మంది రైతులకు రూ.66వేలకోట్ల పెట్టుబడి సాయ అందించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమే అన్నారు. సీఎం కేసీఆర్ సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్లే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.09 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు. మూడు పంటలు సాగు చేసుకునేలా సకల సదుపాయాలు కల్పిస్తున్న బీఆర్‌ఎస్ కావాలో.. 3 గంటల విద్యుత్ చాలంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలో రైతులే నిర్ణయించాలని కోరారు. అనంతరం రైతులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, రైతులకు అండగా ఉండే సీఎం కేసీఆర్ వెంటే ఉంటామంటూ రైతులు తీర్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సలహాదారుడు మారుపాక సురేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, పి.శ్రీకాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎంపీటీసీ పర్వతాలు, శ్రీనివాస్‌రెడ్డి, నూతనగంటి రఘు, దస్రూ, శ్రీను, వి.రాజు, కె.రామస్వామి, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానానికి చేతులెత్తి మద్దతు తెలుపుతున్న రైతులు

## మంత్రి జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

నిడమనూరు, జూలై 19 : రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్ యాదవ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి సారథ్యంలో నల్లగొండ జిల్లా అభివృద్ధి మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రంజిత్‌యాదవ్

## వార్షిక రుణ ప్రణాళిక రూ.8937 కోట్లు

- ఆర్‌బీఐ ఎల్‌డీఓ వైభవ్




రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న ఆర్‌బీఐ ఎల్‌డీఓ వైభవ్

నల్లగొండ, జూలై 19 : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూ.8937 కోట్లుగా నిర్ణయించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కలిసి ఆర్‌బీఐ ఎల్‌డీఓ వైభవ్ వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఇందులో అత్యధికంగా పంట రుణాలకు రూ.4909.19 కోట్లు ఉండగా రూ.2266.22 కోట్లు టర్మ్ రుణాలు, రూ.821.64 కోట్లు సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల రుణాలు, రూ.438.31 కోట్లు ఇతర ప్రాధాన్యతా రుణాలు, ప్రాధాన్యతా రుణాలకు రూ.501.65కోట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు వివిధ రంగాలకు కేటాయించిన రుణాల లక్ష్యాలను విధిగా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం శ్రామిక్, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్, మెప్మా పీడీ కరుణాకర్, డీఏఓ సుచరిత, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## 108లో మహిళ ప్రసవం

నిడమనూరు, జూలై 19 : 108లో మహిళ ప్రసవించిన ఘటన బుధవారం మండలంలోని నారమ్మగూడెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గర్భిణి బొల్లెంపల్లి శ్రీలతకు పురిటి నొప్పులు రావడంతో దవాఖానకు తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది శ్రీలతను అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది ఆమెకు వాహనంలోనే కాన్పు చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానలో చేర్పించామని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీఆర్ ఏఈఈ రాజునాయక్

చందంపేట, జూలై 19 : మండలంలోని బిల్డింగ్ తండా గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణ పనులకు బుధవారం పంచాయతీరాజ్ ఏఈఈ రాజునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామపంచాయతీలకు కొత్త భవనాలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సంతోషి, మోహన్, కుమార్, మహేశ్, రమేశ్, శోభన్, సాయిలు పాల్గొన్నారు.

## హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి : ఎంపీడీఓ

చందంపేట, జూలై 19 : మండలంలోని అన్ని గ్రామాలు హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ రాములునాయక్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని వీధులు, రోడ్ల వెంట, పొలాల గట్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. అందుకు గానూ అధికారులు గ్రామస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉపంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ మొక్కలు నాటేందుకు వీలుగా ఉపాధి కూలీలతో గుంతలు తీయించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏపీఓ వరలక్ష్మి, ఏపీఎం జానయ్య పాల్గొన్నారు.

## రైళ్లపై రాళ్లు రువ్విన ఆరుగురి అరెస్ట్

మిర్యాలగూడ, జూలై 19: ఇటీవల రామన్నపేట, తిప్పర్తి, మిర్యాలగూడ రైల్వేస్టేషన్ల పరిధిలో జరిగిన రైళ్లపై రాళ్ల దాడి ఘటనల్లో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసులో నిందితులందరూ విద్యార్థులేనని పేర్కొన్నారు. వారి దాడిలో ఏసీ రైలు కిటికీలు దెబ్బతిన్నాయని, ప్రయాణికులెవరికీ గాయాలు కాలేదన్నారు. రైళ్లపై దాడులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, దాడులకు పాల్పడే వారికి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిఘా ఉంచాలని సూచించారు.

## అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

- మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ, జూలై 19: ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆర్డీఓ చెన్నయ్య సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, బీఎల్‌ఓ యాప్‌పై బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు తమ పరిధిలో ఉన్న అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది కల్పన, జాని, షరీఫ్, సందీప్, సత్యనారాయణ, జమాల్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

### ఓటర్ నమోదుపై బీఎల్‌ఓలకు శిక్షణ

మాల్ : నూతన ఓటర్ల నమోదుపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బూత్‌లెవల్ అధికారులకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తాసీల్దార్ విశాలాక్షి, డీటీ హర్షద్, నియోజక వర్గ మాస్టర్ ట్రైనర్స్ పులిగిల గోవర్ధన్‌రావు, సాట్ల ఇద్దయ్య, గౌడుగు శ్రీను ఆర్ఐ నర్సింహ పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణను డిప్యూటీ తాసీల్దార్ కె. రంగారెడ్డి ప్రారంభించారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### తిరుమలగిరి సాగర్‌లో..

తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బీఎల్‌ఓలకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాసీల్దార్ ఇస్లావత్ పాండునాయక్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ మల్లిఖార్జున్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు పరశురాంగౌడ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం నోవా పాల్గొన్నారు.

### నేడు బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

దేవరకొండ : బూత్ లెవల్ అధికారులకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ నిర్వహించనున్నట్లు తాసీల్దార్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు హాజరు కావాలని సూచించారు.

## పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

- మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

కొండమల్లేపల్లి, జూలై 19 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ కృషి చేస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి, చింతకుంట్ల జడ్పీఉన్నత పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ పహణీకుమార్, ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, ఓరుగంటి శ్రీను, మండల అధ్యక్షుడు వాసికర్ల రమేశ్, ప్రధాన కార్యదర్శి జి. జగదీశ్, ఎంఈఓ మాత్రు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా వెంకట్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట, జూలై 19 : సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఎ.వెంకట్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పనిచేస్తున్న ఎస్.మోహన్‌రావు మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ కాగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ హైదరాబాద్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎ.వెంకట్‌రెడ్డి సూర్యాపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెవెన్యూ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.